## వెంకన్నను దర్శించుకున్న హైకోర్టు సీజె జస్టిస్ ఠాకూర్

తిరుమల,అక్టోబర్ 28ప్రభాతవార్తప్రతినిధి:



రాష్ట్రహైకోర్టు ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ కుటుంబసమేతంగా శనివారం ఉదయం వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. దర్శనానంతరం టిటిడి జెఇఒ వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. తిరుచానూరు పద్మావతిఅమ్మవారిని జస్టిస్ ఠాకూర్ దంపతులు దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

# తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





## శక్తిక్షేత్రంలో పౌర్ణమిన చండీహోమం

బోయకొండ(చౌడేపల్లి), అక్టోబర్ 28 ప్రభాతవార్త



శక్తిక్షేత్రం బోయకొండలో శనివారం పౌర్ణమిన చండీ హోమంను నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి విశేషాభిషేకం, అలంకరణ గావించారు. అనతరం ప్రాంగణంలోని గంగమ్మ ఉత్సవ విగ్రహం సమక్షంలో వేదపండితులచే నిర్వహించబడ్డ చండీ హోమం భక్తులను అలరించింది. ఆలయ ఛేర్మన్ నాగరాజరెడ్డి, ఇఒ చంద్రమౌళి, అధికార, అర్చక, సిబ్బంది సేవలందించారు.

# చంద్రగ్రహణం కారణంగా ఆలయాలు మూసివేత









పాక్షికచంద్రగ్రహణం కారణంగా మూతబడిన తిరుమల ఆలయం, కాణిపాకం ఆలయం , అప్పలాయగుంటలోని ప్రసన్నవెంకటేశ్వర స్వామి, శ్రీ నివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం

## తిరుమల ఆలయం మూసివేత

తిరుమల,అక్టోబర్ 28ప్రభాతవార్తప్రతినిధి:

పాక్షికచంద్రగ్రహణం కారణంగా వేంకటేశ్వరస్వామి ఆలయ తలుపులు శనివారం రాత్రి 7.05గంటలకు మూతబడ్డాయి. గ్రహణం వీడిన తరువాత ఆదివారం తెల్లవారుజామున 3గంటలకు యధావిధిగా ఆలయ తలుపులు తెరిచి శుద్ధిచేసి భక్తులను తిరిగి స్వామివారి దర్శనానికి అనుమతించారు.తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం,తిరుపతిలోని కపిలేశ్వరస్వామి ఆలయం, వినాయకసాగర్‌లోని వరసిద్ధివినాయక ఆలయం కూడా మూసివేశారు.

## అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వరాలయం మూసివేత

వడమాలపేట, అక్టోబరు 28 ప్రభాతవార్త:

చంద్రగ్రహణం సందర్భంగా అప్పలాయగుంటలోని ప్రసన్నవెంకటేశ్వర స్వామి ఆలయాన్ని శనివారం రాత్రి 7 గంటలకు మూసివేశారు. ఆదివారం ఉదయం 5 గంటలకు ఏకాంతంగా ఆలయాన్ని శుద్ధి చేసి సుప్రభాతసేవ అనంతరం 7గంటలకు భక్తులను అనుమతిస్తామని ఆలయ అధికారి శివకుమార్ తెలిపారు.

## కల్యాణ వెంకన్న ఆలయం మూసివేత

చంద్రగిరి, అక్టోబర్ 28 ప్రభాతవార్త:

శ్రీ నివాసమ ంగా పురంలో వెలసియున్న శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం పాక్షిక చంద్రగ్రహణం కారణంగా శనివారం 7 గంటలకు మూసివేశారు. ఆదివారం వేకువజామున 1.05 గంటల నుండి 2.22 గంటల వరకు పాక్షిక చంద్రగ్రహణం వుంటుందని ఆలయ అధికారులు వెల్లడించారు. వేకువజామున 4.30 గంటలు ఆలయాన్ని తెరచి ఆలయ శుద్ధి గావించి, నిత్యకైంకర్యాల అనంతరం ఉదయం 7 గంటలకు స్వామి వారి దర్శన భాగ్యం కల్పించనున్నట్లు తెలిపారు.

# కునుకేసిన చినుకు.. ఎండుతున్న ఎలిది పంట



ఎండుతున్న ఎలిది పంట

## దిగాలుగా అన్నదాతలు

దొరవారిసత్రం, అక్టోబర్ 28 ప్రభాతవార్త

రైతులు వేసిన ఎలిది పైరు మాడిపోతోంది. వర్షం కురవకపోవడంతో వరిపంట రోజురోజుకు మాడుతోంది. దొరవారిసత్రం మండల పరిధిలో సుమారు 3 వేల హెక్టార్లలో మెట్ట ప్రాంతంలో ఉన్న రైతులు వరిపంట వేసిన విషయం తెలిసిందే. వరుణుడు కరుణించకపోవడంతో వరిపంట రోజురోజుకి మలమల మాడుతోంది. వర్షాకాలం ప్రారంభమైనా ఎక్కడ కూడా చినుకు కురవకపోవడంతో అన్నదాతలు దిగాలు పడుతున్నారు. ఇప్పటికే సుమారు ఎకరాకు రూ.10 వేలు నుంచి రూ.15 వేలు పెట్టుబడులు పెట్టి పొలాల వదనద రైతులు వర్షం కోసం ఎదురు చూస్తున్నా ఫలితం లేదు. మాడిపోతున్న పంటను చూసి కన్నీటి పర్యంతమవుతున్నారు.

## పవిత్రోత్సవంలో మంత్రి రోజా



మంత్రి రోజాకు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న ఆలయ అధికారులు

నగరి, అక్టోబరు 28 ప్రభాతవార్త:

మున్సిపల్ పరిధి సత్రవాడ కరి వరదరాజస్వామి ఆలయంలో నిర్వహించిన పవిత్రోత్సవంలో మంత్రి రోజా పాల్గొన్నారు. ఆలయ అధికారులు ఆమెకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ చేసిన అనంతరం ప్రాథమిక హోమం, అంత హోమం, సర్కార్ సంకల్ప హోమం అంటూ పూర్ణ యాగంలో పాల్గొన్న ఆమె కరి వరదరాజస్వామిని దర్శించుకున్నారు. వేద పండితులు వేదమంత్రాలతో ఆమెను ఆశీర్వాదించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణన్, మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు బీ.ఆర్.వీ అయ్యప్పన్, జగన్, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

## గణనాధునికి ఘనంగా అన్నాభిషేకం

### -ఆకట్టుకున్న ప్రత్యేక అలంకరణ

కాణిపాకం, అక్టోబర్ 28 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో శనివారం స్వామివారికి అన్నాభి షేకంను అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా ఆలయంలో అల్పిసిపౌర్ణమి సందర్భంగా స్వామివారికి అన్నాభిషేకం నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు శనివారం స్వామివారికి ఈ కార్యక్రమంను నిర్వహించారు. ఈకార్యక్రమా నికి కాణిపాకంకు చెందిన సల్లా సుబ్బరాయలుశెట్టి కుమారులు సల్లా వాసు, సల్లా హరిలు ఉభయదారులుగా వ్యవహ రించారు. ఈమేరకు వీరు ఉదయం మంగళ వాయిద్యాల నడుమ వరుస ఉభయం తీసుకు రాగా ఆలయంలో అర్చక స్వాములు స్వామివారి మూలవిరాట్‌కు వేదపండితుల మంత్రోచ్ఛారణ నడుమ శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం నిర్వహించారు.అనంతరం స్వామివారిని అన్నంతో శోభాయమానంగా అలంకరించి వివిధ రకాల పిండివంటలు, పండ్లను స్వామివారికి నైవేధ్యంగా సమర్పించారు. అనంతరం భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. అన్నాభిషేకం సందర భంగా ఉభయదారులచే ఆలయంలో చేపట్టిన ప్రత్యేక అలంకరణ ఎంతో అకట్టుకుంది. ఈకార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు, ఏఈఓలు ఎస్వీ.కృష్ణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్ కోదండపాణి,శ్రీధర్‌బాబు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాబు, సురేష్, ఉత్సవ ఉభయదారులు, అర్చకులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## ఆది కవి వాల్మీకి మహర్షి జీవితం స్ఫూర్తి దాయకం : కలెక్టర్

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 28, ప్రభాతవార్త



వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శనీయం, స్ఫూర్తిదాయకమని వారు ఆది కవి, మహాకవి అని జిల్లా కలెక్టర్ వెంకటరమణా రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయబడిన జిల్లా స్థాయి వాల్మీకి జయంతి కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిధిగా పాల్గొని వాల్మీకి మహర్షి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ కృషి ఉంటే మనుషులు ఋషులవుతారని,అలాంటి మహనీయులు మన వాల్మీకి మహర్షి అని వారి జీవితాన్ని మనం ఆదర్శంగా స్ఫూర్తిగా తీసుకుని వారి అడుగుజాడల్లో నడిచేలా వారి స్ఫూర్తిని మనం స్మరించుకునే దానిలో భాగంగా వాల్మీకి జయంతిని మనం రాష్ట్ర పండుగగా జరుపుకుంటున్నామని అన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ, సాధికార అధికారి భాస్కర్ రెడ్డి, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి బాలకొండయ్య,సిబ్బంది పాల్గొన్నారు.

## రానున్న ఎన్నికలపై పూర్తి దృష్టి

### - నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ రిశాంత్‌రెడ్డి

చిత్తూరు, అక్టోబర్ 28 ప్రభాతవార్త:



ఎన్నికలు సమీపిస్తుండటంతో ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించడానికి పోలీసులు ఇప్పటి నుండి ప్రణాళికా బద్ధంగా విధులు నిర్వర్తించాలని ఎస్పీ రిశాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. చిత్తూరులో శనివారం ఎస్పీ రిశాంత్‌రెడ్డి జిల్లాలోని పోలీసు అధికారులు, ఎస్ఐలతో నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్పీ రిశాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రాపర్టీ నేరస్తులు, ఇతర పాత నేరస్తులపై గట్టి నిఘా వుంచాలన్నారు. ఎర్రచందనం, నాటుసారా, ఇసుక అక్రమ రవాణా నేరస్తులపై ఉక్కుపాదం మోపాలన్నారు. అలాగే పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితంగా పరిష్కరించాలన్నారు. క్రికెట్ బెట్టింగ్‌లో జరుగకుండా పక్కా చర్యలు చేపట్టాలన్నారు. మహిళా పోలీసులు మహిళలు, విద్యార్థినిలకు సమాజంలో జరిగే నేరాలు, సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో అడ్మిన్ అడిషనల్ ఎస్పీ సుధాకర్, సెబ్ అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మి, ఎస్‌బి డిఎస్పీ శ్రీనివాసరెడ్డి, సబ్‌డివిజనల్ అధికారులు, డిఎస్పీలు, సర్కిల్ ఇన్స్‌పెక్టర్లు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల చదువుల పట్ల శ్రద్ధ చూపాలి

### జిల్లా విద్యాశాఖాధికారి శేఖర్

గూడూరు, అక్టోబర్ 28, ప్రభాతవార్త



పిల్లల చదువుతున్నట్ల ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయులు శ్రద్ధ చూపడం లేదని జిల్లా విద్యాశాఖాధికారి శేఖర్ తెలిపారు. శనివారం గూడూరు పట్టణంలోని జడ్పి బాలుర ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో డివి జన్ స్థాయి సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి అన్ని మండలాల నుండి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సమీక్షకు హాజరైన డిఈవో శేఖర్ మాట్లాడుతూ ఆరో తరగతిలో చేరిన విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం లేదన్నారు. వారు బాగా చదవడం లేదని వదిలేస్తున్నారన్నారు. అప్పుడు చదవకపోతే ఇప్పుడు చదవలేరా మీరెలా నిర్ణయిస్తారంటూ ఆయన సభాముఖంగా ఉపాధ్యాయులను ప్రశ్నించారు. ప్రధానోపాధ్యాయులు కూడా తరగతి గదులను పర్యవేక్షిస్తూ ఉండాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఉన్నతంగా చదివేందుకు చొరవ తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఉప విద్యాశాఖాధికారి శివప్రకాష్ రెడ్డి, సిఎంఓ సురేష్, ఎంఈవో సనత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకమైన ఓటర్ల జాబితా సిద్ధం చేయండి

### ఓటర్ నమోదు అధికారి హరిత

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 28, ప్రభాతవార్త

పారదర్శకమైన ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని ఓటరు నమోదు అధికారులకు ఓటర్ నమోదు అధికారి హరిత ఆదేశాలు జారీ చేసారు. శనివారం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఓటర్ నమోదు అధికారులతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్త ఓటర్లుగా నమోదు చేయబడిన ఓటర్ లిస్టును క్షుణ్ణంగా పరిశీలించాలని అన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులుగా ఉన్న బూత్ లెవెల్ ఏజెంట్లకు కొత్త ఓటర్ల లిస్టును పరిశీలనకు ఇవ్వడం చేయాలన్నారు. అక్టోబర్ 27 నుండి డిసెంబర్ 9 వరకు ఎలాంటి క్లెయిమ్‌లు వచ్చినా స్వీకరించాలని అన్నారు. అదనపు ఓటర్ నమోదు అధికారులు తిరుపతి అర్బన్ తహశీల్దార్ వెంకటరమణ, స్మార్ట్ సిటి జిఎం చంద్రమౌళి, డిప్యూటీ తహశీల్దార్ జీవన్, ఓటర్ నమోదు సిబ్బంది పాల్గొన్నారు.



## సినీ ఫక్కీలో బంగారు నగలు చోరీ

పుత్తూరురూరల్, అక్టోబరు 28 ప్రభాతవార్త:

సినీ ఫక్కీలో బంగారు నగలు దుకాణంలో 20 గ్రాముల బంగారు చైన్ పట్ట పగలు చోరీ చేసి ఎత్తుకెళ్లిన సంఘటన పుత్తూరు పట్టణంలోని శనివారం ఉదయం జరిగింది. పుత్తూరు పట్టణం తిరుపతి–అరక్కోణం రోడ్డులోని ఓ వస్త్ర దుకాణానికి శనివారం ఉదయం వచ్చిన ఓ వ్యక్తి టవల్ కొనుగోలు చేశారు. తమ బంధువుల వివాహం ఉందని, సమీపంలోఏదైనా బంగారు దుకాణం ఉందా అని అడిగారు. దీంతో సదరు వస్త్ర దుకాణం యజమాని పక్కనే మండీ సందులోనే ఉందని, బంగారు దుకాణం యజమానికి చరవాణి ద్వారా బంగారం కొనుగోలుకు వచ్చి ఉన్నారని తెలియజేశాడు. దీంతో మండీ వీధిలోని లలిత బంగారు దుకాణం యజమాని మురళి దుకాణం తెరచి వచ్చిన వ్యక్తికి నల్లపూసల చైన్లు, కమ్మలు, తాళిబొట్టు వంటివి చూపారు. తనకు చైన్ కావాలని కోరాడు. దీంతో అతను చూపించారు. బిల్లు వేసే సమయంలో బంగారు చైన్‌ను జేబులో వేసుకన్నాడు. బిల్లు వేయండి తమ బంధువులు నగదు తెస్తున్నారని ఫోన్ చెవి వద్ద పెట్టుకుని అటు ఇటు దుకాణంలో కొంత సమయంలో తిరిగాడు. బయట ఓ యాచకురాలకు చిల్లర వేసి అటు ఇటు చూసి దుకాణం నుంచి కొంత దూరం నడిచి వచ్చి అక్కడ నుంచి పరుగులు తీసి వెళ్లిపోయాడు. ఇదంతా కూడా సీసీ టీవీ కెమెరాల్లో రికార్డు అయి ఉండడం గమనార్హం. బంగారు దుకాణం యజమాని బిల్లు వేసి అనంతరం వస్తువులు చెక్ చేసుకోవడంతో 20 గ్రాముల బంగారం చైన్‌చోరీకి గురైనట్లు గుర్తించి బయటకు వచ్చి చూసే లోపు వెళ్లిపోయాడు. దీంతో పోలీసులకు ఫిర్యాదుచేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పుత్తూరు పోలీసులు తెలిపారు.

# రక్తదానం మరొకరి ప్రాణం నిలబెడుతుంది







## -పోలీసు అమరవీరులపేరుతో మెగా రక్తదానశిబిరం

తిరుపతి,అక్టోబర్ 28ప్రభాతవార్త:

ఒకరు చేసే రక్తదానం ఆపదలో ఉన్న మరొకరికి ప్రాణం నిలబెడుతుందని, వేరొకరికి జీవితం ఇవ్వడమే కాదని కొన ఊపిరితో ఉన్న వారి ముఖంలో చిరునవ్వుని చూద్దామని తిరుపతి జిల్లా ఎస్పి పి.పరమేశ్వరరెడ్డి తెలిపారు. నిజ జీవితంలో పోలీసులు నిరంతరం ఒత్తిడి, శ్రమతో విదులు నిర్వహిస్తున్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని కోరారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శనివారం తనపల్లి వద్ద మెగారక్తదాన శిబిరం తిరుపతి జిల్లా పోలీసువిభాగం ఏర్పాటు చేసింది. ఈ రక్తదాన శిబిరంలో స్వయంగా జిల్లా ఎస్పి పి.పరమేశ్వరరెడ్డి, అదనపు ఎస్పిలు కులశేఖర్, వెంకట్రావు, ఏఆర్ అదనపు ఎస్పి లక్ష్మీనారాయణరెడ్డి, డిఎస్పిలు భవ్యకిశోర్, నరసప్ప, సురేంద్ర రెడ్డి,గిరిధర్, కాటమరాజు, రవికుమార్,చంద్రశేఖర్, పోలీసు అధికారులు, పోలీసులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. 500మందికిపైగా దాతలు 787 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. ఈ రక్తదాన శిబిరంలో పాల్గొనడం అభినందనీయమని ఎస్పి పరమేశ్వరరెడ్డి కొనియాడారు. అనంతరం దాతలకు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ఒక మనిషి ఇంకో మనిషికి రక్తదానం చేయడం వల్ల ప్రాణదానం చేయవచ్చని శుభసంకల్పంతో స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని తిరుపతి జిల్లా పోలీసుశాఖ ఏర్పాటు చేసిందన్నారు.

## ఆలయ నిర్మాణంకు తెదేపా తరపున లక్ష రూపాయల విరాళం

– ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, అక్టోబర్ 28 ప్రభాతవార్త

మండలంలోని కంగుంది గ్రామంలో శ్రీ వాల్మీకి మహర్షి ఆలయ నిర్మాణంకు కుప్పం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ తరపున లక్ష రూపాయల విరాళంను అందించనున్నట్లు ఎమ్మెల్సీ,సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ ప్రకటించారు. శనివారం వాల్మీకి కులస్తులతో ఆయన మాట్లాడారు. కంగుంది గ్రామం ఎంతోపురాతన చరిత్ర కలిగిందని ఇక్కడి ప్రాంతాన్ని వాల్మీకి,బోయకులస్తులు పరిపాలించడం గొప్ప విషయమన్నారు. కుప్పం చరిత్రకు సాక్ష్యంగా నిలిచే కంగుందిలో ఆలయ నిర్మాణం చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అంతకుముందు కంగుంది గ్రామంలో వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, నేతలు తిరుపతి, లోకేష్, దివాకర్, షరీఫ్, వాల్మీకి,బోయ కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## చంద్రబాబు ఆరోగ్యంకై తిరువణ్ణామలైలో గిరిప్రదక్షిణ

కుప్పం, అక్టోబర్ 28 ప్రభాతవార్త




మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆరోగ్యంగా ఉండాలని, ఆయన త్వరగా జైలునుంచి బయటకు రావాలని కోరుతూ కుప్పం తెలుగుయువత నాయకుడు డివి భాస్కర్ అధ్వర్యంలో యువ నేతలు తమిళనాడులోని తిరువణ్ణామలైలో గిరిప్రదక్షిణ చేశారు. పౌర్ణమి సందర్భంగా వారు తిరువణ్ణామలైలో గిరి ప్రదక్షిణ చేసి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.కార్యక్రమాల్లో యువత నాయకులు ఉమాశంకర్, శశికుమార్, మధుబాబు, మనోజ్‌కుమార్, మంజునాథ్, నిఖిల్‌కుమార్ పాల్గొన్నారు.

## నారా భువనేశ్వరిని కలసిన జనసేన అధ్యక్షుడు అమీర్

కుప్పంరూరల్, అక్టోబర్ 28 ప్రభాతవార్త



ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరిని గుడుపల్లె మండల జనసేన అధ్యక్షుడు అమీర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆమెకు పవన్‌కళ్యాణ ,చంద్రబాబునాయుడు, నారాలోకేష్‌ల జ్ఞాపికను అందించారు. తెలుగుదేశం, జనసేన పార్టీలు సంయుక్తంగా కలసి పనిచేయాలని ముున్ముందు కార్యాచరణ ప్రకటించడం జరుగుతుందని నారా భువనేశ్వరి తెలిపారు. చంద్రబాబు అరెస్ట్, వైకాపా ప్రభుత్వ వైఫల్యాలు ప్రజల్లో బలంగా తీసుకెళ్లాలని సూచించినట్లు ఆయన తెలిపారు.కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు డా॥ హరిప్రసాద్‌పాల్గొన్నారు.

## చంద్రబాబు ఆరోగ్యంగా ఉండాలని టెంకాయలు గొట్టిన నేతలు

కుప్పంరూరల్, అక్టోబర్ 28 ప్రభాతవార్త



తెదేపా అధినేత చంద్రబాబునాయుడు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని అలాగే ఆయన త్వరగా బయటకు రావాలని కోరుతూ మల్లానూరులో వాల్మీకి కులస్తులు 101టెంకాయలు పగలగొట్టారు. కార్యక్రమంలో నేతలు సాంబశివ ం, బాబునాయుడు, విభూషణ్,జయరాంనాయుడు,మునిరత్నం నాయుడు,వాల్మీకి కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## భూవివాదంపై గ్రామస్తుల ధర్నా

వి.కోట, అక్టోబర్ 28 ప్రభాతవార్త



మండలంలోని కొంగాటం పంచాయతీ కొండేపల్లి వద్ద భూవివాదంపై గ్రామస్తులు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. బాధితుల కథనం మేరకు వివరాలిలా.. కొండేపల్లి సర్వే నెం 183/2లో 30సెంట్ల ప్రభుత్వ భూమిని గతంలో ఇళ్ల నిర్మాణాలకు కేటాయించగా ఎనిమిది కుటుంబాలు ఇళ్లు కట్టుకుని అక్కడే ఉంటున్నారు. అయితే సుశీలమ్మ పేరిట రికార్డుల్లో పేరు నిలిచిపోయింది. ఇది గుర్తించి పంచాయతీ కార్యదర్శి కెఆర్ సురేష్ ఈ భూమి పక్కనే తనకు గల 60సెంట్ల భూమితో కలిపేయాలని యత్నించాడు. సుశీలమ్మ పేరిట ఉన్న భూమిని తన సోదరుడు నరేష్ పేరిట రిజిస్ట్రేషన్ చేసేశారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్న వారు రెండు లక్షల మేర చెల్లించాలని కార్యదర్శి, అతని సోదరుడు బెదిరిస్తున్నట్లు గ్రామస్తులు వాపోయారు. ఈసంఘటనపై విచారించి తగు చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ చిట్టిబాబు పేర్కొన్నారు.

## మంత్రి జయరాంచే వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ట

పెద్దపంజాణి, అక్టోబర్ 28 ప్రభాతవార్త



పెద్దపంజాణి తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో వాల్మీకి సోదరుల చిరకాల వాంఛ అయిన వాల్మీకి మహర్షి విగ్రహంను శనివారం రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ప్రతిష్టించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ మానవతా విలువలు, ఉన్నతమైన ఆదర్శాలను బోధించే రామాయణ కావ్యాన్ని లిఖించి అందరి గుండెల్లో వాల్మీకి మహర్షి చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## చంద్రగ్రహణంతో అర్ధగిరి ఆలయం మూసివేత

కాణిపాకం, అక్టోబర్ 28 ప్రభాతవార్త:



చంద్రగ్రహణం కారణంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీఅర్ధగిరి శ్రీవీరాంజనేయ స్వామి ఆలయాన్ని శనివారం సాయంత్రం శాస్త్రోక్తంగా మూసివేశారు. శనివారం అర్ధరాత్రి పాక్షిక చంద్రగ్రహణం సంభవించడంతో సాయంత్రం 5 గంటలకు ఆలయంను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా మూసివేశారు. గ్రహణానంతరం ఆదివారం వేకువజామున ఆలయాన్ని తెరచి ఆలయశుద్ధి చేసి పుణ్యాహావాచనం స్వామివారికి గ్రహణానంతరం ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు ఉదయం 6 గంటల నుండి మూల మూర్తి దర్శనం కల్పించనున్నారు. ఈమేరకు సాయంత్రం 5 గంటల నుండి జరిగే అన్ని ఆర్జిత సేవలు పౌర్ణమి సందర్భంగా భక్తులు సౌకర్యార్థం ఏర్పాటు చేసే అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు రద్దయ్యాయి. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

## వాడవాడలా ఘనంగా వాల్మీకి మహర్షిజయంతి వేడుకలు

కుప్పం, అక్టోబర్ 28 ప్రభాతవార్త



రామాయణ ఇతిహాస రూపకర్త మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను కుప్పం నియోజకవర్గంలోని వాడవాడలా వాల్మీకి, బోయ కులనేతల అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కుప్పం శ్రీ రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం నిర్వహించారు. స్థానిక బస్టాండు వద్ద వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూజలు చేసి అన్న క్యాంటీన్‌లో అన్నదానం జరిపారు. ఈసందర్భంగా సంఘ నేత మల్లానూరు ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ వాల్మీకి కులస్తులను ఎస్టీల జాబితాలో చేర్చుతామన్న సిఎం జగన్‌రెడ్డి హామీని మరిచారన్నారు. వాల్మీకులను అణచివేస్తున్నారన్నారు. 2017లో అప్పటి సిఎం చంద్రబాబునాయుడు వాల్మీకులను ఎస్టీల్లో చేర్చాలని అసెంబ్లీలో ప్రతిపాదించి కేంద్రానికి పంపారన్నారు. నేడు సిఎం జగన్‌రెడ్డి వాల్మీకులను మోసగించారన్నారు. వాల్మీకులను గుర్తించింది చంద్రబాబుకే దక్కుతుందన్నారు. వాల్మీకుల ఓట్లు అడిగే హక్కు తెలుగుదేశంపార్టీకే ఉందన్నారు. రాష్ట్రంలో వైకాపాను ఓడించేందుకు వాల్మీకులు ఒకేత్రాటిపై నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో జిల్లా నేత బేటప్పనాయుడు, రాష్ట్రనేతలు సింగిరి శ్రీనివాసులు, మునిరత్నంనాయుడు, జయరాంనాయుడు, వెంకటస్వామి, సూరి, మురళి, కృష్ణప్ప, కేశవదాసు, వెంకటరమణ, రామచంద్ర, తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, మండల పార్టీ అధ్యక్షులు ప్రేమ్‌కుమార్,బాబునాయుడు, రాజ్‌కుమార్, మాజీ ఎంపిపి సాంబశివం, శాంతారాం, కాణిపాకం వెంకటేష్, కౌన్సిలర్ సోమశేఖర్, దివాకర్, షరీఫ్, అనసూయ, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## బాలికలు విద్యలో రాణించి ఉన్నతస్థాయికి ఎదగాలి

– ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్

కుప్పం, అక్టోబర్ 28 ప్రభాతవార్త



బాలికలు విద్యలో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఎమ్మెల్సీ,జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్, మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ పేర్కొన్నారు. మున్సిపల్ పరిధి ఎనిమిదో వార్డులోని డా॥ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో చిత్తూరు ఎంపి రెడ్డెప్ప నిధులతో ఏర్పాటుచేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను వారు ప్రారంభించి ప్రసంగించారు. సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నాడు–నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను కార్పోరేట్ స్థాయికి మార్చారన్నారు. పేదల పిల్లలు ఆంగ్లం చదువుకునేందుకు ఎంతో చొరవ చూపుతున్నారన్నారు. బడిపిల్లలకు సిఎం జగన్ మేనమామగా మారి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. విద్యార్థులు బాగా చదివి రాష్ట్రానికి మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గణపతి, ఆంజనేయగుడి ఛైర్మన్ కుమరేష్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి

చౌడేపల్లి, అక్టోబర్ 28 ప్రభాతవార్త



గుండె పోటుతో ఇంగ్లీషు బోధించే మాస్టారు మృతి చెందిన సంఘటన చోటుచేసుకొంది. స్థానిక ఉన్నతపాఠశాలలో రామకృష్ణ(52) ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నాడు. ప్రతి రోజు ఆయన పుంగనూరు నుంచి స్థానిక పాఠశాలకు వస్తుంటాడు. ఈక్రమంలో శనివారం పాఠశాలకు బయలుదేరుతున్న సమయంలో రామకృష్ణకు ఛాతిలో నొప్పి వచ్చింది. దీంతో దగ్గర్లోని ఆసుపత్రికి తరలించగా అప్పటికే గుండెపోటుతో మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. వృత్తినే దైవంగా భావించి ఎందరికో విద్యాబుద్ధులు నేర్పించిన రామకృష్ణ మాస్టారు మృతి తీరని లోటుగా పలువురు అభివర్ణించారు. వారితోపాటు విద్యార్థిలోకం శోకసంద్రంలో మునిగింది.

## గంగమ్మ సేవలో ఆర్‌పిఎఫ్ అధ్యక్షుడు మంజునాథ్‌రాయల్

బోయకొండ(చౌడేపల్లి), అక్టోబర్ 28 ప్రభాతవార్త



శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మను కర్ణాటకరాష్ట్ర రాయల్‌పీపుల్‌ఫ్రంట్(ఆర్‌పిఎఫ్)యువత అధ్యక్షుడు మంజునాథ్‌రాయల్ దంపతులు దర్శించుకొన్నారు. ఆలయ అధికార, ధర్మకర్తల కమిటీ సభ్యులు వారిని సాదరంగా ఆహ్వానం పలికి అమ్మవారి దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితుల ఆశీర్వాదం, అమ్మవారి పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు. పుంగనూరు నియోజకవర్గ, మండల ఆర్‌పిఎఫ్ అధ్యక్షులు హేమంత్‌రాయల్, ఆనందరాయల్, జగదీష్, పృద్వీ, రాజేంద్రరాయల్, రాజు రాయల్ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## అభయ శంకర ఆలయంలో ప్రత్యేక పూజలు

సూళ్లూరుపేట, అక్టోబర్ 28 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలోని శ్రీఅభయశంకర ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకొని శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ముందుగా ప్రత్యేక అలంకరణ చేసి వేదపండితుల మంత్రోచ్ఛరణలతో రుద్రాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమం ఆకుతోట రమేష్ ఆధ్వర్యంలో జరిగింది.

## సూళ్లూరుపేట విస్తృత స్థాయి సమావేశానికి తరలిన టిడిపి కార్యకర్తలు



సూళ్లూరుపేట, అక్టోబర్ 28 ప్రభాతవార్త

సూళ్లూరుపేట తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి సూళ్లూరుపేట నుంచి కార్యకర్తలు శనివారం భారీఎత్తున తరలి వెళ్లారు. నాయుడుపేటలో నిర్వహిస్తున్న ఈ సమావేశానికి పట్టణ పార్టీ అధ్యక్షుడు ఆకుతోట రమేష్ ఆధ్వర్యంలో కార్యకర్తలు తరలి వెళ్లారు. సమావేశంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం అధ్యక్షతన బీద రవిచంద్ర ముఖ్య అతిథిగా పాల్గొంటారని స్థానిక నాయకులు తెలిపారు.

## పురందేశ్వరి సభను విజయవంతం చేయండి

బిజేపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్ఎస్ఆర్ నాయుడు

వెంకటగిరి, అక్టోబర్ 28, ప్రభాతవార్త




నవంబర్ ఒకటో తేదీన బిజేపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి తిరుపతికి వస్తున్న సందర్భంగా పార్టీ కార్యకర్తలు నాయకులు తరలిరావాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్ఎస్ఆర్ నాయుడు తెలిపారు. వెంకటగిరిలోనే బిజేపి కార్యాలయంలో ఆయన పురందేశ్వరి సభ ఏర్పాటుపై పార్టీ కార్యకర్తలు నాయకులు చర్చించారు. పురందేశ్వరి సభకు జన సమీకరణ పై ఆయన నాయకులతో చర్చించారు. టిడ్కో గృహాలను వైసిపి వారు కంటి తుడుపు చర్యగా ఇస్తున్నట్లు తెలిపారు. అప్పటికే కేంద్ర మంత్రి వెంకమ నాయుడు ఇక్కడ గృహాలు మంజూరు చేశారని తెలిపారు. టిడిపి వైసిపి ప్రభుత్వాలు గృహాలను త్వరితగతిన నిర్మించి లబ్ధిదారులకు ఇవ్వడంలో జాప్యం చేసినట్లు తెలిపారు. 2024 ఎన్నికల్లో టిడిపి, వైసిపికి ప్రజల గుణపాఠం చెప్తారన్నారు. సమావేశంలో బిజేపి నాయకులు గురుప్రసాద్, యోగేశ్వర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## మహాప్రస్థానం పనులను పరిశీలించిన రామ్ కుమార్ రెడ్డి

వెంకటగిరి, అక్టోబర్ 28, ప్రభాతవార్త



పట్టణంలోని రామలింగేశ్వర స్వామి గుడి ప్రాంతంలో నిర్మితమవుతున్న మహాప్రస్థానం పనులను వైసిపి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి పార్టీ నాయకులు పరిశీలించారు. కామిశెట్టి రామయ్య, వరలక్ష్మీ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు అర్జున్ మహాప్రస్థానాన్ని సొంత నిధులతో నిర్మించారు. వర్షాకాలంలో కూడా కర్మక్రతువులు చేసుకునేందుకు ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేశారు. దహన సంస్కారానికి ఎలక్ట్రిక్ యంత్రాన్ని ఏర్పాటు చేయించారు. మహాప్రస్థానం ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆయన వెంట వైసిపి జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు సురేష్ రెడ్డి, నాయకులు మురళి కృష్ణ, ప్రసాద్ రెడ్డి, ఢిల్లీ బాబు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు

వెంకటగిరి, అక్టోబర్ 28, ప్రభాతవార్త



స్థానిక 9వ బెటాలియన్ నందు వాల్మీకి జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి గురించి అధికారులు అందరికీ వివరించి తెలిపారు. వాల్మీకి చిత్రపటానికి పూల మాలు వేసి నివాళులర్పించారు. కమాండెంట్ పి. ప్రకాష్ ముఖ్యఅతిథిగా పాల్గొనగా, డిఎస్‌పి ఎన్టీవీ రామ్ కుమార్, ఎంఎల్ మనోహర్, అసిస్టెంట్ కమాండెంట్, బెటాలియన్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## బడికి రాని పిల్లలను బడిలో చేర్చిన సిఎంఆర్‌టి

సూళ్లూరుపేట, అక్టోబర్ 28 ప్రభాతవార్త

సూళ్లూరుపేట మండల పరిధిలోని తూర్పుప్రాంత పల్లెలైన కొరిడి సమీపంలోని దీవిలో కొంతమంది గిరిజనుల పిల్లలు చేపలు పట్టుకుంటూ బడికి రాకుండా జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం కొరిడి ప్రాంతానికి వెళ్లిన సిఎంఆర్‌టికి ఈ దృశ్యం కంటపడింది. తక్షణమే స్పందించి వారి తల్లిదండ్రులతో మాట్లాడి బడికి వస్తే ప్రభుత్వం ద్వారా ఒనగూరే ప్రయోజనాలను వివరించారు. అమ్మఒడి ద్వారా రూ.15 వేలు, యూనిఫాం, బూట్లు తదితర సామగ్రితో పాటు భోజనం కూడా ఏర్పాటు చేస్తారని సిఎంఆర్‌టి తెలిపారు. దీంతో గిరిజన పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి పంపేందుకు అంగీకరించారు. కొరిడి ఉపాధ్యాయులు తిరుపతయ్యకు వీరిని అప్పగించి బడిలో కూర్చోబెట్టారు. ఈ కార్యక్రమాన్ని సిఎంఆర్‌టి అంకయ్య చేపట్టారు.

## అక్రమ మద్యం బాటిల్ తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

చిల్లకూరు, అక్టోబర్ 28, ప్రభాతవార్త

మండలంలోని ఓడూరు గ్రామానికి చెందిన రమేష్ అనే వ్యక్తి గత కొన్ని రోజుల నుండి అక్రమ మద్యం బాటిళ్లు విక్రయిస్తున్నాడు. అయితే శుక్రవారం రాత్రి బ్రాందీ షాపులు వద్ద నుండి అక్రమంగా 75 మద్యం బాటిల్ తీసుకుని ఇంటికి వెళ్తున్న క్రమంలో సిఐ దశరథ రామారావుకి పక్కా సమాచారం రావడంతో వెంటనే ఎస్ఐ అంజిరెడ్డి రమేష్‌ని అదుపులో తీసుకుని కేసు నమోదు చేసి అతని వద్ద ఉన్న మద్యం బాటిల్ స్వాధీనం చేసుకుని కోర్టుకు హాజరుపరిచారు.

## శానిటరీ ఇన్స్పెక్టర్లు విధులు సక్రమంగా నిర్వహించాలి

ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు

గూడూరు, అక్టోబర్ 28, ప్రభాతవార్త



గూడూరు పట్టణ పరిధిలోని శానిటరీ ఇన్స్పెక్టర్ల పనితీరు ఆశించిన మేరకు లేదని గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద రావు అసహనం వ్యక్తం చేశారు. శనివారం తిరుపతి జిల్లా గూడూరు పట్టణంలోని షాదీ మందిరంలో గూడూరు పట్టణ పరిధిలోని వార్డు సచివాలయాల సిబ్బంది శానిటరీ ఇన్స్పెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్ రావు మాట్లాడుతూ సచివాలయం సిబ్బంది అంకితభావంతో ప్రజల సమస్యల పరిష్కారానికి పాటు పడాలని పిలుపునిచ్చారు. అదే విధంగా శానిటరీ ఇన్స్పెక్టర్లు పనితీరును మెరుగుపరుచుకోవాలని సూచించారు. అనంతరం గూడూరు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర రావు మాట్లాడుతూ సానిటరీ ఇన్స్పెక్టర్లు టైమింగ్ విషయంలో మరింత శ్రద్ధ తీసుకోవాలని లేని పక్షంలో శాఖపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో గూడూరు మున్సిపల్ కమిషనర్ వెంకటేశులు, వైసిపి నాయకులు బత్తిన విజయకుమార్, పట్టణ అధ్యక్షులు బొమ్మిడి శ్రీనివాసులు, పట్టణ వార్డు సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## తిక్కవరంలో పూరిల్లు దగ్ధం

చిల్లకూరు, అక్టోబర్ 28, ప్రభాతవార్త



మండలంలోని తిక్కవరం గ్రామ పంచాయితీలో దువ్వూరు మునిచంద్రారెడ్డి అనే వ్యక్తి పూరిల్లు విద్యుత్ సర్క్యూట్ షాక్‌కు గురై అగ్నికి ఆహుతి అయింది. ఇంట్లో ఉన్న రొయ్యల గుంటలకు సంబంధించి ఏ థియేటర్‌లో, ఫ్యాన్లు, వైర్లు, టేకు చెక్కలు, పూర్తిగా కాలిపోవడం జరిగింది. విషయాన్ని గూడూరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారంతో ఇవ్వడంతో వారు వెంటనే వచ్చి మాటలను అదుపు చేసు ప్రయత్నం చేపట్టారు. అప్పటికే పూర్తిగా కాలిపోవడం జరిగింది. దీంతో మూడు లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని ఇంటి యజమాని మునిచంద్రారెడ్డి తెలిపారు. వెంటనే విఆర్‌ఓ శ్రీనివాసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి రిపోర్ట్ రాయడం జరిగిందన్నారు.

## రైతులకు అవగాహన సదస్సులు

చిల్లకూరు, అక్టోబర్ 28, ప్రభాతవార్త



చిల్లకూరు మండలం ఏరూరు, మోమిడి, వరగలి గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో ఖరీఫ్ 2023 సంవత్సరంకు ఈ పంట నమోదు చేయించుకున్న రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి చిల్లకూరు మండల వ్యవసాయ అధికారిని గూడూరు భవాని మాట్లాడుతూ ఈ పంట నమోదు చేయించుకున్నటువంటి రైతు సోదరులకు సంబంధించి వారి యొక్క వివరాలతో కూడిన జాబితాను మీ యొక్క రైతు బరోసా కేంద్రంలో ప్రదర్శించడం జరిగింది. ఈ జాబితాలో ఎటువంటి అభ్యంతరాలు ఉన్న ఈ నెల 29వ తేది లోపు రాతపూర్వకంగా సమీప గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి ఇవ్వవల్సిందిగా తెలిపారు. ఇక వేల మీ దగ్గర ఏదైనా అభ్యంతరాలు ఉంటే తాము సరిచేసి నవంబర్ ఒకటో తేదిన ఫైనల్ జాబితాను ఆర్‌బికేల నందు ఉంచడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రాప్ నమోదు చాలా ముఖ్యం ఎందుకంటే మీకు సున్నా వడ్డీ పంట రుణాలు రావాలన్నా మద్దతు ధరకు మీ యొక్క వ్యవసాయ ఉత్పత్తులు ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నా, ఉచిత పంట భీమా, పంట నష్టపరిహారం పొందాలన్నా ఈ క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకుని ఉండాలన్నారు. అందువల్ల రైతు సోదరులందరూ మీ యొక్క వివరాలను జాగ్రత్తగా సరిచూసుకుని అభ్యంతరాలు ఉంటే 29వ తేదిలోగా మాకు తెలియజేయాలన్నారు. నవంబర్ ఒకటో తేది తర్వాత జాబితా ప్రదర్శించిన తర్వాత ఎటువంటి మార్పులు చేర్పులు చేయడానికి వీలుపడదన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పరిధిలో సాగు చేసిన పంటలు వివరాలు, రైతుల వివరాలు గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులకు చదివి వినిపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు సిహెచ్ వెంకట కృష్ణయ్య, పి. విజయమ్మ, ఎస్‌కె నసీఫా, ఈ పంట నమోదు చేయించుకున్న రైతులందరూ పాల్గొన్నారు.

## ఉత్సాహం కొరవడి..నామమాత్రపు కార్యక్రమాలు

-సమన్వయలోపం..తెదేపాకు శాపం

**సత్యవేడు, అక్టోబర్ 28, ప్రభాతవార్త :**

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సత్యవేడు తెదేపాలో ఉత్సాహం కొరవడిందని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏకంగా పార్టీ అధినేత చంద్రబాబు నాయుడును అరెస్ట్‌చేయడం..తదనంతరం జరిగిన నిరసన కార్యక్రమాల్లో సత్యవేడు ప్రాంతపు నాయకులు పెద్దగా స్పందించలేదని ఆరోపణలు ఉన్నాయి. సత్యవేడు తెదేపా ఇన్‌ఛార్జ్ హెలెన్ కూడా పలుమార్లు హెచ్చరించినప్పటికి నాయకుల్లో సమన్వయ గ్రహణం వీడటం లేదని కార్యకర్తలు నెత్తినోరు మొత్తుకుంటున్నారు. అవసరమైన కఠిన సందర్భాల్లో కూడా నాయకులపై ఇన్‌ఛార్జ్ పెద్దగా చర్యలు తీసుకోలేకపోతున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితులు ఇలాగే కొనసాగితే ఎన్నికల్లో తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని కార్యకర్తలు లభోదిభో మంటున్నారు. ఇక మండలాల వారీగా నేతల పనితీరును విశ్లేషించుకుంటే..కేవిబి పురం మండలంలో పార్టీ పటిష్టంగా ఉంది. అక్కడ ఓఇద్దరు నేతల ఆధిపత్యంతో పార్టీ కార్యక్రమాలు భాగా ఊపందుకుంటుంది. మిగిలిన ఆరు మండలాల్లోనూ నాయకుల మధ్య సమన్వయలోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. క్షేత్రస్థాయిలో కార్యకర్తలు ఉత్సాహంగా ఉన్నప్పటికి వారిలో మంచిచైతన్యం తీసుకువచ్చి ముందుకు నడిపించే విషయంలో అనేక అవరోధాలు ఉన్నాయని వాపోతున్నారు. మొత్తంమీద మండలాల వారీగా నేతల పనితీరును సమీక్షించి ముందుకు వెళ్ళకపోతే తీవ్రనష్టం పొంచిఉందని పలువురు చెపుతున్నారు. ఆదివారం జరిగే సమన్వయ సమావేశంలో పార్టీకి పూర్తిస్థాయిలో శస్త్రచికిత్సలు చేసుకుని ముందుకువెళ్ళాల్సిన పరిస్థితి ఎంతైనాఉంది. దీనికితోడు కొందరు పగలు అధికార పార్టీతోనూ..రాత్రి సైకిల్‌జోరుగా ఉందనే ముసుగువేసుకుని ఉండేవారిని గుర్తించి పక్కాగా ఎన్నికల వ్యూహంలోకి వెళ్ళకపోతే మరింతనష్టం తప్పదని తెదేపా కార్యకర్తలు వాపోతున్నారు.

## చంద్రబాబు విడుదల కాలేదని గుండెపోటుతో వ్యక్తి మృతి

**విజయపురం, అక్టోబరు 28 ప్రభాతవార్త:**



మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు విడుదల కాలేదని విజయపురం మండలం చెంగమనాయుడు కండ్రిగ గ్రామానికి చెందిన దివ్యాంగుడు త్రిమూర్తినాయుడు(58) శనివారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందాడు. శుక్రవారం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి నారావారి పల్లెలో కలవడానికి గ్రామస్థులతో పాటు వెళ్లాడు. కానీ దివ్యాంగుడు కావడంతో ఎక్కువ మంది జన సంచారం ఉండడం వలన ఆమెను కలవలేక నిరాశతో వెనుదిరగడంతో కుప్పకూలాడు. చంద్రబాబు విడుదల కాలేదని, ఆయన సతీమణిని కలవలేక పోయానంటూ నిరుత్సాహంగా మాట్లాడుతూ ఇంటికి చేరాడని, శనివారం సాయంత్రం చాతీనొప్పి అంటూ ఆస్పత్రికి తీసుకెళ్ళగా మార్గమధ్యమంలో మృతి చెందాడని స్థానికులు తెలిపారు,.

## కారు ఢీకొని వ్యక్తి మృతి

**పుత్తూరురూరల్, అక్టోబరు 28 ప్రభాతవార్త:**



కారు ఢీకొని మృతి చెందిన సంఘటన పుత్తూరు మండలం తడుకు వద్ద శనివారం రాత్రి జరిగింది. సీఐ లక్ష్మీనారాయణ కథనం మేరకు.. పశ్చిమబెంగాల్ రాష్ట్ర కలకత్తా సమీప పట్టణానికి చెందిన నీలకంఠసింగ్(38) పుత్తూరు మండలం తడుకు వద్ద రైల్వే వంతెన పనులు చేస్తున్న గుత్తేదారుడి వద్ద పని చేస్తున్నాడు. శనివారం ఆరోగ్యం సరిగా లేదని పనికి వెళ్ళలేదన్నారు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి పుత్తూరుకు వచ్చేందుకు తడుకు దళితవాడ వద్ద ఆటో కోసం వేచి ఉండగా తిరుపతి నుంచి చెన్నై వెళుతున్న కారు ఢీకొనడంతో మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం తెలిసిన వెంటనే నీలకంఠసింగ్ మృతదేహాన్ని పుత్తూరు ఆస్పత్రికి తరలించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## సదాశివేశ్వర స్వామివారి ప్రత్యేక అన్నాభిషేకంలో పాల్గొన్న మంత్రి

**పుత్తూరురూరల్, అక్టోబరు 28 ప్రభాతవార్త:**



పుత్తూరు పట్టణంలో వెలసి ఉన్న శ్రీ కామాక్షి సమేత సదాశివేశ్వర స్వామివారికి ప్రత్యేక అన్నాభిషేకంలో మంత్రి రోజా పాల్గొన్నారు. మంత్రిని ఆలయంలోపూర్ణ కుంభంతో స్వాగతంపలికారు. శ్రీ కామాక్షి సమేత సదాశివే శ్వర స్వామివారిని వేద పండి తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి స్వామివారిని దర్శనం చేసుకున్నారు. అనంతరం వేద పండితులు మంత్రిని వేదమంత్రాలతో ఆశీర్వదించారు. పుత్తూరు శివాలయం పాలక మండల సభ్యులు, మున్సిపల్ వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జూడో క్రిడాకారులకు టిషర్ట్స్ అందజేసిన రాజేష్, భానుప్రకాష్ రెడ్డి



**తిరుపతి (క్రీడ), అక్టోబర్ 28, ప్రభాతవార్త**

ఎన్ఆర్ఐ మదనపల్లి వాసి టూటుకూరి శ్యాం సుందర్ ఎస్‌జిఎఫ్ అండర్ 14,17,19 కంబైండ్ చిత్తూరు జిల్లా జూడో జట్టు 60 మంది బాలబాలికల కోసం ఇచ్చిన టి షర్ట్స్‌ను జిల్లా జూడో సంఘం, జెన్ అకాడమి అధ్యక్షులు రాజేష్, ఉపాధ్యక్షులు భానుప్రకాష్ రెడ్డి, కార్యదర్శి చీనేపల్లి కిరణ్ కుమార్ , సామాజిక వేత్త మున్నారెడ్డి, హర్షవర్ధనుల చేతులు మీదుగా క్రీడాకారులకు అందజేసారు. ఎస్‌జిఎఫ్ జిల్లా కార్యదర్శులు జయరామయ్య, విజయలక్ష్మిలు క్రీడాకారులను ప్రోత్సహించడం కోసం టూటుకూరి శ్యాం సుందర్ వారి నాన్న టూటుకూరి శంకర్ జ్ఞాపకార్థం టిషర్ట్స్ ఇవ్వడం ఆనందదాయకని అన్నారు. రాజేష్ ప్రతిభ కలిగిన క్రీడాకారులకు జెన్ అకాడమి తరపున ఉచితంగా శిక్షణ ఇస్తామని భానుప్రకాష్ రెడ్డి అన్నారు. జిల్లా జూడో జట్టుకు కోచ్‌గా గోపి, మేనేజర్లుగా చంద్రశేఖర్ రాజు, సునీత,శివలు తదితరులు పాల్గొన్నారు.



## వైస్ ఎంపిపి గుండెపోటుతో మృతి

**పెనుమూరు, అక్టోబర్ 28 ప్రభాతవార్త:**

గుండెపోటుతో పెనుమూరు మండల వైస్ ఎంపిపి దూది అరుణ(47) శనివారం మృతి చెందారు. మండలంలోని రామకృష్ణాపురం ఎంపిటిసీగా ఎన్నికైన దూది అరుణ వైస్ ఎంపిపిగా ఎన్నికయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ విదేశీ వ్యవహారాల సలహాదారుడు, మాజీ ఎంపి జ్ఞానేంద్రరెడ్డి ముఖ్య అనుచరుడు దూది శంకర్ సతీమణి దూది అరుణ వైస్ ఎంపిపిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం ఆమె స్వగృహంలో హఠాత్తుగా ఆమెకు గుండెపోటు రావడంతో ఆమె అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. కుటుంబసభ్యులు వెంటనే పెనుమూరు ప్రభుత్వ ఆసుపత్రికి ఆమెను చికిత్స నిమిత్తం చేర్పించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆమె మృతి పట్ల ప్రభుత్వ విదేశీ వ్యవహారాల సలహాదారులు, మాజీ ఎంపి జ్ఞానేంద్రరెడ్డి, జిల్లా వైకాపా కార్యదర్శి మహాసముద్రం దయాసాగర్‌రెడ్డి, మండల కన్వీనర్ సురేష్‌రెడ్డి, ఎంపిపి హేమలత, జడ్పీటిసీ దొరస్వామి యాదవ్, సింగిల్‌విండో అధ్యక్షుడు గోవిందరెడ్డి, వైకాపా నాయకులు చక్రవర్తినాయుడు, సర్పంచ్ దూది వెంకటేష్, మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, దూది త్యాగరాజులు, కో-అప్షన్ సభ్యుడు మురాద్‌లు సంతాపం వ్యక్తం చేశారు.

## జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వండర్ సైన్స్

**పాలసముద్రం, అక్టోబర్ 28 ప్రభాతవార్త:**

పాలసముద్రం మండలం తిరుమలరాజుపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వండర్ సైన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జన విజ్ఞాన వేదిక నాయకులు యుగంధర్, సుధాకర్‌లు విద్యార్థుల్లో మూఢ నమ్మకాలు పోగొట్టడానికి ప్రయోగాలు చేసి వివరించారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక నాయకులు మాట్లాడుతూ ఆధునిక సమాజంలో ఇప్పటికీ మూఢనమ్మకాలు, నాలుకపై శూలాలు తీయడం, నోటి నుండి లింగాలు తీయడం వంటికి చేయడం నమ్మకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ గిరిజ, పాఠశాల హెడ్మాస్టర్ దీనదయాళ్, ఉపాధ్యాయుడు గుణశేఖర్, వాసు, శ్రీనివాసులు, మురుగదాస్ తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా స్థాయి అండర్-17 ఫుట్‌బాల్ పోటీల్లో ఎస్ఆర్ఆర్ పాఠశాల విద్యార్థిని ప్రతిభ

**పాలసముద్రం, అక్టోబర్ 28 ప్రభాతవార్త:**

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాలసముద్రం మండలం ఎస్ఆర్ఆర్ కండ్రిగ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎన్.శాలిని విజయం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ మేరకు కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి అండర్-17 ఫుట్‌బాల్ పోటీల్లో శాలిని పాల్గొంటుందని పాఠశాల పిడి శివకుమార్ పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన శాలినిని పాఠశాల హెడ్మాస్టర్ మనోహర్‌నాయుడు, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

## ఎట్టకేలకు దంపూరి లే అవుట్‌కు దారి ఏర్పాటు



**తిరుపతిరూరల్, అక్టోబర్ 28 ప్రభాతవార్త:**

ఎట్టకేలకు శ్రీ నిలయ లే అవుట్ నుండి దంపూరి లే అవుట్‌కు అధికారులు దారిని ఏర్పాటు చేయించారు. దీర్ఘకాలికంగా ఆవిష్కృతమైవున్న దారి సమస్యను తుడ వి.సి. ఆదేశాలతో చిగురువాడ గ్రామ పంచాయతీ కార్యధర్శి శనివారం జెసిబి సాయంతో అడ్డు గోడను తొలగించారు. తిరుపతిరూరల్ చిగురువాడ గ్రామ పంచాయతీలో ఉన్న శ్రీ నిలయ లే అవుట్ నుండి దంపూరి లే అవుట్‌కు దారి ఏర్పాటు చేయవల్సివుంది. కానీ శ్రీ నిలయ లే అవుట్‌లో ప్లాట్ కొనుగోలు చేసి, నివాసం ఉంటున్న కొంత వ్యక్తులు దంపూరి లే అవుట్‌కు దారి ఇవ్వకుండా అడ్డుపడుతూ వచ్చారు. స్థానికుడు అవిలాల దిలీప్‌యాదవ్ శ్రీ నిలయ లే అవుట్ నుండి దంపూరి అప్రూవల్ లే అవుట్‌కు దారి ఇప్పించాలని తుడ వి.సి. హరికృష్ణకు ఫిర్యాదు చేసారు. శ్రీ నిలయ అప్రూవల్ లే అవుట్ నుండి దంపూరి అప్రూవల్ లే అవుట్‌కు దారి సమస్యను పరిష్కరించాని ప్లాట్స్ కొనుగోలుదారులు కూడా కోరారు. రెండు లే అవుట్‌లు తుడ అప్రూవల్ పొంది ఉండటంతో శ్రీనిలయ లే అవుట్ నుండి దంపూరి లే అవుట్‌కు దారి ఏర్పాటు చేయాలని చిగురువాడ గ్రామ పంచాయతీ కార్యధర్శికి తుడ వి.సి ఆదేశాలు జారీ చేసారు. దీంతో పంచాయతీ కార్యధర్శి జెసిబి సాయంతో అడ్డుగోడను తొలగించారు. ఎన్నో సంవత్సరాలుగా దారి లేక ఇబ్బందిపడుతు దంపూరి లే అవుట్ ప్లాట్స్ కొనుగోలుదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దారి సమస్య పరిష్కారానికి కృషి చేసిన దిలీప్ యాదవ్‌ను ప్లాట్స్‌యాజమానులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆలయాల్లో ఘనంగా పౌర్ణమి పూజలు

చంద్రగ్రహణంతో మూతపడ్డ ఆలయాలు

**నారాయణవనం, అక్టోబర్ 28 ప్రభాతవార్త :**



శనివారం మండలంలోని వెంకటకృష్ణాపాలెం పంచాయతీ పరిధి నాగిలేరు శింగిరికోనలో ప్రసిద్ధి చెందిన శ్రీదేవి,భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో పౌర్ణమి పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో శుద్ధి, నిత్యకైంకర్య పూజా కార్యక్రమాలను నిర్వహించిన తర్వాత అభిషేకం చేసారు. నెయ్యి, కొబ్బరినీరు, పశుపు, కుంకమ, చందనం, విభూది వంటి సుగంధద్రవ్యాలతో అభిషేకం చేసిన తర్వాత పుష్పాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శనం చేసుకున్నారు. అంతకుముందు పవిత్ర జలపాతంలో స్నానాలను చేసారు. మధ్యాహ్నం భక్తులకు ఉచితంగా అన్నదానం చేసారు. అలాగే నారాయణవనంలో అవదూతగా వెలసిన తాతాసారకాయులస్వామి ఆలయంలోను పౌర్ణమి పూజలను ఘనంగా జరిపారు. స్వామివారికి అభిషేకం చేసిన తర్వాత పుష్పాలతో సుమనోహ రంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మధ్యాహ్నం వందలాది మంది భక్తులకు అన్నదాన ం నిర్వహించారు. రాత్రి 7గంటలకు ఆలయాలను చంద్రగ్రహణంతో మూసివేశారు.

## సాధనవారిపాళ్యెం రోడ్డుకు సిసిఎల్ కాఫీ పరిశ్రమ చేయూత

రూ. 15 లక్షలతో మొదటి విడతగా మెటల్ రోడ్డు ఏర్పాటుకు భూమి పూజ

**వరదయ్యపాళ్యెం, అక్టోబర్ 28, ప్రభాతవార్త**



వరదయ్యపాళ్యెం మండలం సాధనవారిపాళ్యెం గ్రామానికి వెళ్ళే మట్టి రోడ్డును మొదటి విడతలో మెటల్ రోడ్డుగా నిర్మాణం చేసేందుకు సీసీఎల్ కాఫీ పరిశ్రమ ముందుకొచ్చింది. సామాజిక బాధ్యత అనే కార్యక్రమం ద్వారా 15 లక్షల రూపాయిలు నిధులతో మెటల్ రోడ్డుగా నిర్మాణం చేయనున్న రోడ్డు పనులకు శనివారం ఉదయం గ్రామస్థుల సమక్షంలో పరిశ్రమ ప్రతి నిధులు, ప్రజా ప్రతినిధులుభూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. భవిష్యత్‌లో అదే రోడ్డును తారు రోడ్డుగా కూడా అభివృద్ధి చేస్తామని సీసీఎల్ కాఫీ పరిశ్రమ పిఆర్ఓ కిషోర్, డీజీఎం సురేష్‌లు తెలిపారు. సాధనవారిపాళ్యెం రోడ్డు ఇబ్బందులు గురించి గ్రామస్థుల విన్నపం మేరకు స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం నెల రోజుల క్రితం క్షేత్ర స్థాయిలో సాధనవారిపాలెం గ్రామాన్ని సందర్శించి రోడ్డు ఇబ్బందులను పరిశీలించారు. తక్షణమే గుంతలమయంగా వున్న రోడ్డును అభివృద్ధి చేయాలని గ్రామ సమీపంలోని సిసిఎల్ కంపెనీ వారికి ఎమ్మెల్యే విన్నవించడంతో స్పందించిన పరిశ్రమ యజమాన్యం రోడ్డు అభివృద్ధికి ముందుకొచ్చారు. గ్రామస్థుల రోడ్డు ఇబ్బందుల పట్ల చొరవ చూపిన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంకి, పరిశ్రమ యాజమాన్యంకు సాధనవారిపాళ్యెం గ్రామస్థులు ప్రత్యేక కృతజ్ఞతలు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్ రెడ్డి, కన్వీనర్ దయాకర్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చిన్న, సింగిల్ విండో చైర్మన్ హరిబాబు రెడ్డి, లక్షణ రెడ్డి, సర్పంచ్ నందయ్య, ఎంపిటీసీ మని, నాయకుల సుబ్రమణ్యం రెడ్డి, చంద్రా రెడ్డి, సుబ్రమణ్యం, శివా యాదవ్, మహీంద్రా, సుధాకర్, బాబు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలకు వంట పాత్రలు పంపిణీ

**వరదయ్యపాలెం, అక్టోబర్ 28, ప్రభాతవార్త**



మండలంలోని ప్రాథమిక 59, ప్రాథమికోన్నత 4, ఉన్నత పాఠశాలలు 6, మొత్తం 69 పాఠశాలలకు మధ్యాహ్న భోజన తయారీకి జగనన్న గోరుముద్ద పథకం క్రింద నాణ్యమైన స్టీల్ వంట పాత్రలను ప్రభుత్వం అందజేసింది. 69 పాఠశాలలకు మంజూరైన వంటపాత్రులను ఎంపిపి పద్మ ప్రియ దామోదర్ రెడ్డి, జడ్పిటిసి వెంకటేష్ మంజూరైన వంట పాత్రలను ప్రధానోపాధ్యాయులకు పంపిణీ చేస్తూ వంట పాత్రలు శుభ్రంగా ఉంచుకొనునట్లు ప్రధానోపాధ్యాయులు పరిశీలించాలన్నారు. ప్రతి పాఠశాలకు వడ్డింపు గిన్నెలు, గెరిటెలు, అన్నం తయారీ పెద్ద పాత్రలు మంజూరైనట్లు, మండల మొత్తానికి రూ. 6.13 లక్షలు విలువ చేసే వంట పాత్రలు సరఫరా అయినట్లు ఎంఈఓ జి. సరస్వతి తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో 2 గున్నయ్య, సంతవేలూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. మాధవయ్య, ఇన్చార్జి హెచ్ఎం వరదయ్యపాలెం రుద్రయ్య, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సురేఖ, శశికుమార్, రమణా రెడ్డి, శ్రీధర్ రావు, సిఆర్‌పిలు, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అందరి భాగస్వామ్యంతో మండలాన్ని ప్రగతిపథంలో నడిపిదాం

ఎంపిపి పద్మప్రియ, ప్రత్యేక ఆహ్వానితుడు దామోదర్ రెడ్డి పిలుపు

**వరదయ్యపాలెం, అక్టోబర్ 28, ప్రభాతవార్త**



మండలంలోని సర్పంచులు, ఎంపిటిసిలు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో మండలాన్ని ప్రగతి పథంలో నడిపించేలా భాగస్వాములు కావాలని ఎంపిపి పద్మప్రియ, ప్రత్యేక ఆహ్వానితుడు దామోదర్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఎంపిడిఓ కార్యాలయంలో మండల సర్వ సభ్య సమావేశాన్ని ఎంపిపి అధ్యక్షతన నిర్వహించారు. వరదయ్యపాలెం తహాశీల్దార్ గౌరీ శంకర్రావు మాట్లాడుతూ రీ సర్వేకి అందరూ సహకరించాలని కోరారు. ప్రభుత్వం 20 సంవత్సరాల క్రితం సాగు చేసుకోవడానికి భూమి, ఇచ్చునున్నట్లయితే, పట్టా ఇచ్చి 20 సంవత్సరాలు అయి వుంటే అమ్ముకోవచ్చు కొనుక్కోవచ్చు అని తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు తమతమ శాఖలో జరిగిన ప్రగతి గురించి వివరించారు. పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ సమస్యలని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అంబూరు సర్పంచు సాయి రెడ్డి, అధికారుల తీరుపై మండిపడ్డారు. శిథిలమైన అంబూరు అంగన్‌వాడీ భవనం అందు కారణం చేత ప్రభుత్వం నూతన అద్దె భవనం అంగన్ వాడీ కేంద్రాన్ని తాత్కాలిక అద్దె భవనం ఏర్పాటు చేయమనిందన్నారు. అనంతరం దామోదర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి అర్హులైన కుటుంబానికి ప్రతి పథకం అందేలా ముఖ్యమంత్రి జగనన్న నాయకత్వంలో వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న సురక్ష పథకంను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అందరూ సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ సుబ్రమణ్యం, ఏవో సుహర్ లత, ఎంఇఓ సరస్వతి, ఐసిడిఎస్ సూపర్వైజర్ జ్యోతి, విద్యుత్ శాఖ అధికారి సుబ్రమణ్యం, ఇరిగేషన్ శాఖ బాబు, ఇంచార్జి ఏపిఎం భాస్కరయ్య, సర్పంచుల సంఘం అధ్యక్షుడు చంద్రారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఇంచార్జి సుబ్రమణ్యం, కోఆప్షన్ సభ్యులు సిద్ధిక్, సర్పంచులు ఎంపిటిసిలు పాల్గొన్నారు.

## ఈనెల 31న మినీ జాబ్‌మేళా

**తొట్టంబేడు, అక్టోబర్ 28 ప్రభాతవార్త**

ఈనెల 31వ తేదీ మంగళవారం తొట్టంబేడు మండలకేంద్రానికి సమీపంలోని ఎస్పీఎ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 9గంల నుంచి తిరుపతిలోని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సం తిరుపతి జిల్లా ఆధ్వర్యంలో జరుగుతుందని ఎంపిడిఓ సురేష్‌బాబు తెలిపారు. మినీ జాబ్‌మేళాకు సంబందించి అందరు వాలంటీర్ల ద్వారా ప్రజలకు, ముఖ్యంగా యువత జాబ్‌మేళాలో పాల్గొని ఉపాలి కల్పించేలా తెలియజేయాలని వాలంటీర్లను ఆదేశించారు. సూళ్ళూరుపేటలోని సిసిఎల్ (ప్రొడక్ట్స్) ఇండియా ప్రైవేట్ లిమిటెడ్(కాంటినెంటల్ కాఫీ) పరిశ్రమలో ట్రైనీ ఆపరేటర్ పోస్టుకు ఐటిఐ(ఫిట్టర్/వెల్డర్/ఎలక్ట్రిషియన్/మెకానికల్), ట్రైనీ ఇంజనీర్ పోస్టుకు బి.టెక్(ఈసిఈ/ఈఈఈ/మెకానికల్) అసోసియేట్స్ పోస్టులకు (డిగ్రీ బిఎస్సీ(ఎంపిసి, ఎంపిసిఎస్, ఎస్‌సిఎస్), బి.కాం(సిఎ). తిరపతిలోని ఈఎంసి క్లస్టర్‌లో డిక్సన్ టెక్నాలజీస్ ఇండియా లిమిటెడ్‌లో అసెంబ్లింగ్ ఆపరేటర్ల పోస్టులకు (పదోతరగతి/ఇంటర్‌మీడియట్, ఐటిఐ/ డిప్లొమా, లేదా ఏదైనా డిగ్రీ ఉండాలన్నారు.వీటికి పురుషులు, మహిళలు అర్హత ఉందన్నారు. ఇక నాయుడుపేటలోని ఎపిఐఐసి ఎంపి సెజ్ పరిధిలోని గ్రీన్‌టెక్ ఇండ్రస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ట్రైనీ ఆపరేటర్లు, గ్రాడ్యుయేట్ ట్రైనీ ఆపరేటర్, సిఎన్‌సి మిషన్ ఆపరేటర్ల పోస్టులకు ఐదోతరగతి, లేదా ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటిఐ, ఏదైనా డిగ్రీ, డిప్లొమా, బిటెక్(ఈఈఈ/మెకానికల్) పురుషులు మాత్రమే అర్హులన్నారు.ఆసక్తిఉన్న అభ్యర్థులు skilluniverse.apssdc.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వివరాలకు 7989509541, 8919889609 నంబర్లను సంప్రదించవచ్చన్నారు.

## వాల్మీకి విగ్రహానికి పుష్పాంజలి

**తిరుపతి,అక్టోబర్ 28ప్రభాతవార్త:**



వాల్మీకి మహర్షి జయంతి పురస్కరిం చుకుని శనివారం రాయలసీమ రంగస్థలి కళాసంస్థ చైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి వాల్మీకి విగ్రహానికి పుష్పాంజలి ఘటిం చారు. అందరికీ అనుకరణీయమైన రామా యణంరచించి ప్రపంచానికి గొప్ప కావ్యాన్ని అందించిన కవి వాల్మీకి మహర్షి అన్నారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి ఉద్యోగుల నాయకులు గోపాల్, బాలయ్య, పాపయ్య, నాగరాజు, కవిత, జగదీశ్వర్, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ఎన్డీఏకు ఎంపికైన విశ్వం పూర్వ విద్యార్థి ప్రవీణ్‌ను అభినందించిన ఎమ్మెల్సీ

**తిరుపతి (క్రీడ), అక్టోబర్ 28, ప్రభాతవార్త**




యూనియన్ పబ్లిక్ సర్వీసెస్ కమిషన్ నిర్వహించిన నేషన ల్ డిఫెన్స్ అకాడమీ జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలో విశ్వం విద్యా సంస్థల పూర్వ విద్యార్థి గువ్వల ప్రవీణ్ కుమార్ ఎంపికైనట్లు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు, విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎన్. విశ్వనాథ్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌ను ఎమ్మెల్సీ, అప్పుస్మా రాష్ట్ర అధ్యక్షులు ఎంవీ రామచంద్ర రెడ్డి, విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎన్. విశ్వనాథ్ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ఎన్. విశ్వచందన్ రెడ్డి జ్ఞాపికను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రామచంద్రరెడ్డి మాట్లాడుతూ తిరుపతి విశ్వం విద్యా సంస్థలో స్కూల్ సిలబస్‌తో పాటు జాతీయ స్థాయిలో సైనిక్, నవోదయ, మిలిటరీ స్కూల్స్ వంటి పోటీ పరీక్షలకు ఉత్తమ శిక్షణ ఇస్తూ అత్యుత్తమ ఫలితాలను, మార్కులు, ర్యాంకులనందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వనాథ్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయసు నుండి సైనిక్, మిలిటరీ స్కూల్ ఎంట్రన్స్ టెస్ట్‌లో అర్హత సాధించి ఎన్‌డిఏ, ఎన్ఏ వంటి ప్రవేశ పరీక్ష ద్వారా దేశ రక్షణ విభాగంలో ఉన్నత అధికారులుగా ఎంపిక అవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్ తండ్రి నాగరాజు మాట్లాడుతూ విశ్వంలో సైనిక్ కోచింగ్‌తో కలికిరి సైనిక్ స్కూల్‌లో సీటు సాధించి, తద్వారా ఎన్డీఏకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ విజయానికి ముఖ్యకారణమైన విశ్వం విద్యా సంస్థలకు కృతజ్ఞతలు తెలిపారు.

## అండర్ 19 హాకీ, బ్యాడ్మింటన్ జిల్లా జట్టు ఎంపిక

**తిరుపతి (క్రీడ), అక్టోబర్ 28, ప్రభాతవార్త**

తిరుపతిలోని ఎస్‌వి ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో హాకీ, బ్యాడ్మింటన్ జిల్లా బాలబాలికలు జట్లను ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్ 19 స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో ఎంపిక పోటీలు నిర్వహించిన్నట్లు అన్ని జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్. జయరామయ్య తెలిపారు. ఈ ఎంపిక పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరచిన 36 మంది హాకీ క్రీడాకారులను, 10 మంది బ్యాడ్మింటన్ జట్లను ఎంపిక చేశారు. వీరు నవంబర్ 7వ తేది నుంచి 9వ తేది వరకు జరిగే 67వ ఎస్‌జిఎఫ్ అండర్ 19 బాలబాలికల బ్యాడ్మింటన్ చాంఫియన్‌షిప్‌పోటీలలో పాల్గొంటారని తెలిపారు. హాకీ బాలురు జట్టు 18, బాలికలు 18, బ్యాడ్మెంటన్ బాలురు 5, బాలికలు 5 మంది ఎంపికైన్నట్లు తెలిపారు. ఎంపిక కమిటీ సభ్యులుగా డిఎస్ఏ కోచ్‌లు లక్ష్మి,కరణ,నీలిమ, రమేష్, ప్రసన్న, సాయి సుమతి, భార్గవి, శివయ్య, నాగరాజు, కృష్ణలు పాల్గొన్నారు.

## శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు

**నగరి, అక్టోబరు 28 ప్రభాతవార్త:**



మున్సిపల్ పరిధిలోని సత్రవాడలో టీటీడీ ఆధీనంలోని కరి వరదరాజు ఆలయంలో శనివారం పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయాన్ని శుద్ధి చేశారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కరి వరదరాజస్వామిని యాగశాలకు వేంచేపు చేశారు.అక్కడ హోమాలు తదితర వైదిక కార్యక్రమాలు నిర్వహించి, స్నపన తిరుమంజనం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, చందనం, పసుపు తదితర సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణ నడుమ ఈ కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించి పవిత్రాలను కట్టారు. ఆలయంలో సంవత్సరం పొడవునా పలు క్రతువుల్లో ఉత్సవాల్ల తెలిసి తెలియక జరిగినదోషాల నివారణకు ప్రతి ఏడాది పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వేదపండితులు తెలిపారు. పవిత్రోత్సవాలను పురస్కరించుకుని భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి విచ్చేసి స్వామివార్లను దర్శించుకున్నారు. సూపరింటెండెంట్ రమేష్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిషోర్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుందాం

**నగరి, అక్టోబరు 28 ప్రభాతవార్త:**



ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుందామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య అన్నారు. శనివారం స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో ఏఐటీయూసీ నాయకులు నగోమి అధ్యక్షతన సమితి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1920 అక్టోబరు 31వ తేదీ ముంబై నగరంలో ఏఐటీయూసీ స్థాపించబడిందన్నారు. 104 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. ఈ నెల 31 తేదీ జిల్లా వ్యాప్తంగాజెండాలు ఎగురేసి ఈ వేడుకలను ఘనంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగరి పట్టణ సీనియర్‌నాయకులు వేలన్, బాషా, మురళి, శేఖర్, విజయకుమార్, సతీష్, చందామరై, విజయలక్ష్మి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు అరెస్టుతో టీడీపీ మాజీ ఎంపీటీసీ మృతి

**పిచ్చాటూరు, అక్టోబరు 28 ప్రభాతవార్త:**



చంద్రబాబు అక్రమ అరెస్టుతో గత 49 రోజులుగా విడుదల కోసం ఎదురు చూస్తు కలత చెందిన నీరువాయి గ్రామానికి చెందిన మాజీ టీడీపీ ఎంపీటీసీ డి.అశోకన్ శనివారం వేకువ జాము టీవీలో వార్తలు చూస్తూ చంద్రబాబు బెయిల్ వాయిదా పడడంతో గుండెపోటుకు గురై టీవీ చూస్తూ అలాగే కుప్పకూలి మృతి చెందాడు. మృతి చెందుతూ కూడా కుప్పకూలిన భర్త భార్యతో చంద్రబాబు...చంద్రబాబు అంటూ చివరి శ్వాస వదిలారని, మృతుడి భార్య వరలక్ష్మి బోరున విలపించింది. పార్టీ కోసం ప్రాణం ఉన్నత వరకు కష్టపడినా ముగ్గురు బిడ్డలను అనాథలు చేస్తూ వెళ్లిపోయావే మా గతి ఏమీ కావాలంటూ బోరున విలపిస్తున్న ఆమెను చూసి సూపర్ సైతం కంటతడి పెట్టుకున్నారు. దేహానికి అఖిలపక్ష నాయకులు పూలమాల వేసి నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు.

## శ్రీ సదాశివేశ్వర స్వామికి అన్నాభిషేకం

**పుత్తూరురూరల్, అక్టోబరు 28 ప్రభాతవార్త:**



పుత్తూరు పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత సదాశివేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఆశ్వీజ మాసం పౌర్ణమి సందర్భంగా శ్రీ సదాశివునికి అన్నాభిషేకం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం స్వామివారికి కామాక్షి అమ్మవారికి అభిషేకాలు, అలంకరణలు చేశారు. అలాగే ఆలయ ఆవరణలో ఉన్న పరివార దేవతలకు కూడా విశేష అభిషేకాలు చేశారు. సాయంత్రం స్వామివారిని అన్నాభిషేకంతో అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొడగంటి రమేష్‌బాబు, పాలకమండలి సభ్యులు, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న ఆరోగ్య సురక్ష .. ఉచితంగా ఆరోగ్య పరీక్షలు

సర్పంచ్ మల్లం దీపిక చంద్రమౌళి రెడ్డి

**చంద్రగిరి, అక్టోబర్ 28 ప్రభాతవార్త:**



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ ఉచిత ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలని సర్పంచ్ మల్లం దీపిక చంద్రమౌళి రెడ్డి అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్ శనివారం తొండ వాడలో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా ఎంపిడిఓ రమేష్‌బాబు, సింగిల్‌విండో చైర్మన్ మల్లం చంద్రమౌళి రెడ్డి మాట్లాడుతూ బిపి, షుగర్, హెచ్‌బి, కంటి పరీక్షలు చేసుకొని ఆరోగ్యంగా వుండాలన్నారు. గర్భవతులు, చిన్నపిల్లలు సకాలంలో టీకాలు వేసుకోవాలన్నారు. పతి ఒక్కరూ ఆకుకూరలు, కోడిగ్రుడ్లు, చిరుధాన్యాలు వంటివి ఎక్కువగా తీసుకోవాలన్నారు. తద్వారా రక్తహీనత నివారణతో పాటు వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు. పాలు, పెరుగు తీసుకోవడం వలన కాల్షియం లభిస్తుందన్నారు. అనంతరం వృద్ధులకు కళ్ళద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ఎంపిపి నిరంజన్, ఈఓపిఆర్‌డి శశిరేఖ, పంచాయతీ కార్యదర్శి నశ్రీన్ బేగం, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు నాగమణి, సుహాసిని, తదితరులు పాల్గొన్నారు.

## మండల స్థాయిలో జగనన్న వంటపాత్రల పంపిణీ

**నారాయణవనం, అక్టోబర్ 28 ప్రభాతవార్త :**



మండలకేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో జగనన్న వంటపాత్రల పంపిణీ కార్యక్రమం శనివారం జరిగింది. మండలంలోని అన్ని పాఠశాలలకు వంటపాత్రలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దివాకర్‌రెడ్డి, జడ్పీటీసీ కోనేటి సుమన్‌కుమార్, ఎంఇఓలు ప్రభాకర్‌రాజు, గోవిందస్వామి, బాలికల పాఠశాల హెడ్‌మాస్టర్ శశకళ, అందరు హెడ్‌మాస్టర్లు, వంట పని మనుషులు పాల్గొన్నారు.

